# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకన్ నేతృత్వంలోని అత్యున్నత టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు.
- కార్గిల్ విజయ్ దివస్ ను పురస్కరించుకొని యుద్ధంలో వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరులను యావత్తు దేశమంతా ఈరోజు స్మరించుకుంది.
- పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలు ఉండవని, ఒకవేళ చర్చలు జరిగినా అవి పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) అంశంపైనే ఉంటాయని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు.
- జింబాబ్వే తో జరిగిన ఆఖరి టీ-20 క్రికెట్ మ్యాచ్ లో భారత్ 35 పరుగుల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించే పరీక్షల్లో సమగ్ర సంస్కరణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని బలోపేతం చేయడంతో పాటు, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు తీసుకురావడంలో ఆ నిపుణుల బృందం ప్రభుత్వానికి సూచనలు చేయనుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. టాస్క్ ఫోర్స్ నివేదిక ఆధారంగా సురక్షితమైన పరీక్షా విధానాన్ని తీసుకువస్తామని చెబుతూ.. ప్రధానమంత్రి కొద్దిసేపటి క్రితం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రశ్నాపత్రం లీకేజ్ కేసు దర్యాప్తునకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశ్నాపత్రం లీకేజీలను అరికట్టేందుకు పార్లమెంట్ లో కఠినమైన చట్టాన్ని తీసుకురాబోతున్నామని అందుకు సంబందించిన బిల్లును లోక్ సభలో రేపు ప్రవేశ పెట్టనున్నామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతను వినియోగించి విశ్వసనీయమైన, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేస్తామని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

ఈ టాస్క్‌ఫోర్స్‌లో ప్రముఖ సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని, మాజీ ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్, మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, మాజీ విద్యాశాఖ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

1999 కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన భారత సైనికుల వీరోచిత పోరాటాన్ని స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ఈరోజు కార్గిల్ విజయ్ దివాస్ ను జరుపుకుంటున్నాం. 27వ కార్గిల్ విజయ్ దివాస్ ను పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘనంగా

నివాళులర్పించారు. భారత సైనికులు ప్రదర్శించిన అసమాన శౌర్యం, అచంచల సంకల్పం, అత్యున్నత దేశభక్తి భారత సాయుధ దళాల అత్యుత్తమ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయని రాష్ట్రపతి సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘనంగా నివాళులర్పించారు. రక్షణ ఉత్పత్తి, రక్షణ ఎగుమతులు, మిత్రదేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భారత్ నిరంతరం కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి.. భారత్ సాంకేతిక సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేసుకుంటోందని తెలిపారు. ఇటీవల భారత నౌకాదళంలో చేరిన స్వదేశీ స్టెల్త్ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గత ఆదివారం చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతమవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు. అదే విధంగా 'క్యాచ్ ది రైన్' కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, జులై 4వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రజా ఉద్యమం కొనసాగుతోందన్నారు. రాబోయే వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా దేశీయ మట్టితో తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ప్రధానమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 7న జరుపుకోనున్న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులను ప్రోత్సహించాలని, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం ద్వారా పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా, భారత్ ఊహించని స్థాయిలో బదులిస్తుందని ఆ దేశానికి స్పష్టమైందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలు ఉండవని, ఒకవేళ చర్చలు జరిగినా అవి పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) అంశంపైనే ఉంటాయని ఆయన పేర్కొన్నారు. పీఓకే భారతదేశంలో అంతర్భాగమని, దానిని పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించుకుందన్నారు. లడాఖ్‌లోని ద్రాస్ కార్గిల్ యుద్ధ స్మారక స్థూపం వద్ద ఈరోజు జరిగిన 27వ కార్గిల్ విజయ్ దివస్ వేడుకలకు రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధం కేవలం భారతదేశ సైనిక, దౌత్య విజయమే కాకుండా, భారత సైనికుల అజేయ సాహసాన్ని, అసమాన పరాక్రమాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విద్యా మంత్రిత్వ శాఖ బాధ్యతలను కర్తవ్య భవన్‌లో ఈరోజు అధికారికంగా స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ప్రహ్లాద్ జోషి విద్యా మంత్రిత్వ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశానికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి కూడా హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమం-2026లో పాల్గొంటున్న యువతతో ఈరోజు దృశ్య మాధ్యమ విధానంలో సంభాషించారు. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 400 మందికి పైగా యువత ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను ప్రధానమంత్రితో పంచుకున్నారు. వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమం ద్వారా భారత సరిహద్దు గ్రామాల సామాజిక-ఆర్థిక పరిస్థితులు, సాంస్కృతిక వారసత్వం, అభివృద్ధి ఆకాంక్షలను యువత ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్, జింబాబ్వే జట్ల మధ్య ఆఖరి టీ-20 క్రికెట్ మ్యాచ్ లో భారత్ 35 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్ ను క్లీన్ స్వీప్ చేసింది. జింబాబ్వే లోని హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన

భారత్ ప్రత్యర్థికి 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య చేధనలో జింబాబ్వే 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 7 వికెట్లు నష్టపోయి కేవలం 157 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లో మయాంక్ యాదవ్ 3, యష్ ఠాకూర్ 2 వికెట్లు తీయగా, ఓపెనర్ బ్యాట్స్మెన్ వైభవ్ సూర్యవంశీ 81 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

స్కాట్లాండ్ లోని గ్లాస్గో నగరం వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో మీరాబాయ్ చాను స్వర్ణ పతకం సాధించింది. 48కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఆమె ఈ పతకాన్ని దక్కించుకున్నారు. వెయిట్‌లిఫ్టర్ రిషికాంత సింగ్ చనంబమ్ పురుషుల 60 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్నాచ్ విభాగంలో రిషికాంత 121 కిలోల బరువును ఎత్తి కొత్త కామన్వెల్త్ క్రీడల రికార్డు నెలకొల్పారు. అంతకముందు పారా పవర్‌లిఫ్టింగ్ పురుషుల హెవీవెయిట్ విభాగంలో ఝుండు కుమార్ కాంస్య పతకం సాధించి, ఈ ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల ఖాతాను ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =